సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 14 । జూలై । 2024



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. మార్కెట్‌కు 80 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.2°/22.3°

జిల్లా పరిధిలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నూతన ఎస్పీగా రత్న

- పార్వతీపురం మన్యం జిల్లాకు మాధవరెడ్డి బదిలీ



రత్న

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా నూతన ఎస్పీగా వి.రత్న నియమితులయ్యారు. మంగళగిరి ఏపీఎస్పీ -6 బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఈమెను బదిలీపై ఇక్కడికి పంపుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న ఎస్.వి. మాధవరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన ఏప్రిల్ 13న రెండవ ఎస్పీగా బాధ్యతలు తీసుకొని అనతి కాలంలోనే విశేష సేవలందించి మన్ననలు పొందారు.

నల్లమాడ పోస్టాఫీస్‌లో అక్రమాలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడలోని బ్రాంచ్ పోస్టాఫీస్‌లో అక్రమాలు వెలుగుచూశాయి. పొదుపు మొత్తాలు, డిపాజిట్లు, పింఛన్ మొత్తాలను బ్రాంచ్ పోస్టుమాస్టర్ కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు హిందూపురం పోస్టల్ ఎస్పీ విజయ్‌కుమార్, ఏఎస్పీ కళ్యాణ్, దుర్గ తదితర అధికారులు శనివారం పోస్టాఫీస్‌కు చేరుకుని ఖాతాదారుల సమక్షంలో రికార్డులు పరిశీలించారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

ఖాద్రీశా.. నమోనమః



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం స్వామి నామస్మరణతో ప్రతిధ్వనించింది. శనివారం కదిరి, పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నరసింహస్వామి కాపులు మొక్కుబడిగా తలనీలాలు సమర్పించారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

టీబీ డ్యాంలో 30 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 30.690 టీఎంసీలకు చేరింది. గత ఆదివారం 50,715 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శనివారం నాటికి 18,060 క్యూసెక్కులకు చేరింది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 30.690 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్‌ఫ్లో 210 క్యూసెక్కులుగా నమోదవుతోంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1,606.21 అడుగుల వరకు నీరు చేరాయి. గతేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1,585.22 అడుగులతో 7.471 టీఎంసీల నీరు ఉండింది. 7,069 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 261 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మేనుకా పోడల్ బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి గ్లోబల్ యూత్ సదస్సు రెండో రోజు శనివారం కొనసాగింది. సత్యసాయి సన్నిధిలో పలువురు సత్యసాయి సేవా సంస్థల యూత్ సభ్యులు సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు మేనుకా పోడల్ సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని సర్వదేవతలను కొనియాడుతూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది.

తెగుళ్లతో కుదేలు

ఈ ఏడాది వేసవిలో ఎండలు మండిపోయాయి. ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయిలో నమోదయ్యాయి. ఎండల తీవ్రత వక్కతోటలపై ప్రభావం చూపింది. ఎన్నడూ లేనివిధంగా తొలిసారిగా తెగుళ్లు సోకాయి. అది కూడా కొత్తగా వేసిన వక్క చెట్లపై. అగ్గి చీడ, నల్లి, రసం పీల్చే పురుగుల ప్రభావం కనిపించింది. వర్షాలకు కూడా తెగుళ్ల ఉధృతి తగ్గలేదు. ఫలితంగా చెట్ల ఎదుగుదలకు అవరోధం ఏర్పడింది.

- వక్క తోటలకు తెగుళ్లు
- కొత్తగా పెట్టిన తోటలపై పంజా
- ఆరు నెలలుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని ఉద్యానశాఖ



తెగుళ్లతో ఎండుముఖం పట్టిన వక్క చెట్టు, తెగుళ్లు సోకిన వక్క తోట

మడకశిర: ఆంధ్ర – కర్ణాటక సరిహద్దున కొత్తగా సాగు చేసిన వక్క తోటలకు తెగుళ్ల బెడద అధికంగా ఉంది. మడకశిర, పావగడ, హిరియూరు, చెళ్లకెర, శిర తదితర నియోజకవర్గాల్లో రెండేళ్ల నుంచి కొత్తగా సాగు చేసిన వక్క తోటలకు ఈ తెగుళ్లు సోకుతున్నాయి. వక్క చెట్ల గరులు ఎండిపోతున్నాయి.కొన్ని చెట్లు తెగుళ్ల దెబ్బకు పూర్తిగా ఎండి పోతున్నాయి. గతంలో వక్క చెట్లకు ఎలాంటి తెగుళ్లూ వచ్చేవి కావు. ప్రస్తుతం వక్క ధర క్వింటాలు రూ.50 వేల వరకు పలుకుతోంది. వక్క తోటల నిర్వహణ ఖర్చులు కూడా తక్కువే. కూలీల అవసరం కూడా నామమాత్రమే. దీంతో రైతులు ఇతర పంటలు సాగు చేసి నష్టపోవడం కన్నా వక్క తోటల పెంపకమే మేలని భావిస్తున్నారు. దీంతో కొత్త తోటల సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశం ఏర్పడింది.

తెగుళ్లు మొదలయ్యాయిలా..

కొత్తగా సాగు చేసిన వక్క తోటలకు ఆరు నెలల నుంచి తెగుళ్ల బెడద మొదలైంది. వేసవిలో ఎండ వేడిమికి తెగుళ్లు సోకినట్లు రైతులు చెబుతున్నారు. వేసవి సీజన్ ముగియడంతో వర్షాలకు తెగుళ్లు తగ్గుముఖం పడుతాయని ఆశించినా నిరాశే ఎదురైంది. గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.

సలహాలు ఇచ్చేవారే లేరు..

వ్యవసాయ అధికారులు ఖరీఫ్, రబీ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. అవసరమైన సలహాలందిస్తారు. వక్క రైతులకు ఉద్యాన శాఖ అధికారులు అవసరమైన సలహాలు, సూచనలు అందించాల్సి ఉంటుంది. అయితే ఇంత వరకు ఈ శాఖ అధికారులు తిరిగి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో వక్క తోటల విస్తీర్ణం
1,400 హెక్టార్లు

హెక్టారు తోట నుంచి ఏటా వచ్చే ఆదాయం
రూ.**8.50** లక్షలు

ఏటా జిల్లా రైతులకు వచ్చే ఆదాయం
రూ.**119** కోట్లు

అంతుచిక్కడం లేదు



కొత్తగా ఐదు ఎకరాల్లో వక్క తోట పెట్టాం. చెట్లు పెట్టి రెండున్నరేళ్లు కావస్తోంది. ఎన్నడూ లేని విధంగా వక్క చెట్లకు తెగుళ్లు సోకాయి. ఆ తెగుళ్లు ఏవో అంతుపట్టడం లేదు. చెట్లలోని గరులు మాత్రం ఎండి పోతున్నాయి. చెట్లల్లో ఎదుగుదల సన్నగిల్లింది.

– చంద్రప్ప, మధూడి, అగళి మండలం

ఇదే మొదటిసారి



కొత్తగా సాగు చేసిన వక్క తోటలకు తెగుళ్లు సోకడం ఇదే మొదటి సారి.గతంలో వక్క చెట్లకు తెగుళ్లు సోకిన దాఖలాలు లేవు. మందులు స్ప్రే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మందుల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం వక్క రైతులను ఆదుకోవాలి.

– వన్నేష్, పీ బ్యాడిగెర, అగళి మండలం

సలహాలు ఇవ్వాలి



వక్క రైతులకు ప్రభుత్వం సలహాలు, సూచనలు అందించడానికి చొరవ తీసుకోవాలి. వక్క చెట్లకు రోగాలు సోకినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని వక్క రైతులు నష్ట పోకుండా చూడాలి.

– హనుమంతరాయప్ప, కొమరేపల్లి, అగళి మండలం

తెగుళ్ల ప్రభావం అధికమే



ఈ ఏడాది వక్క తోటలకు తెగుళ్ల ప్రభావం అధికంగా ఉంది. ఇందుకు కారణం ఎండ తీవ్రత పెరగడమే. అంతే కాకుండా వక్క సాగు విస్తీర్ణం పెరగడం కూడా తెగుళ్లు రావడానికి కారణమైంది. వక్క మొక్కలను ఎక్కువగా కర్ణాటక ప్రాంతం నుంచి తీసుకువచ్చి నాటుతున్నారు. దీంతో ఈ మొక్కల ద్వారా తెగుళ్లు వ్యాపించడానికి అవకాశం ఏర్పడింది. అగ్గిచీడ, నల్లి, రసం పీల్చే పురుగుల ప్రభావం వక్క చెట్లపై అధికంగా ఉంది. ఈ తెగుళ్ల నివారణకు వక్క రైతులు తప్పకుండా మందులు పిచికారీ చేయాలి.

– చంద్రశేఖర్,జిల్లా హార్టికల్చర్ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతుల దహనం



ప్రతులను తగులబెడుతున్న నాయకులు

పెనుకొండ: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా జీపీఎస్ (గ్యారంటెడ్ పెన్షన్ స్కీమ్) గెజిట్ నోటిఫికేషన్‌ను తీసుకురావడంపై యూటీఎఫ్ మండిపడింది. శనివారం పెనుకొండలోని అంబేడ్కర్ సర్కిల్‌లో జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరితే జీపీఎస్ అమలు చేస్తామని చెప్పింది తప్ప ఎలాంటి జీఓనూ విడుదల చేయలేదన్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాత తేదీతో జీపీఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. ఈ రాజపత్రాన్ని రద్దు చేయాలని, తక్షణమే పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణమే అమలు చేసి 2003 డీఎస్సీ ద్వారా నియమించిన ఉపాధ్యాయులందరినీ పాతపెన్షన్ విధానంలోకి తేవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఉద్యమ బాట పడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, హరికృష్ణ, నారాయణస్వామి, గంగాధర్, చెన్నకేశవులు, అమర్‌నాథరెడ్డి, నరేష్, షన్ముఖ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

‘చిత్రావతి’ని తోడేస్తున్నారు

- తాగునీటి పథకం చుట్టూ ఇసుక తవ్వకాలు





తాగునీటి పథకం బోరు చుట్టూ ఇసుకను తోడిన దృశ్యం, పోతులనాగేపల్లిలో వేగంగా వెళ్తున్న ట్రాక్టర్

ధర్మవరం రూరల్: చిత్రావతి నదిని ఇసుకాసురులు తోడేస్తున్నారు. రోజూ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను బయటకు తరలిస్తున్నారు. నది నుంచి ఇసుకను తరలించకూడదని నిబంధనలు విధించడంతో గత ఐదేళ్లుగా మిన్నకుండిపోయారు. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టిన రోజు నుంచే యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ధర్మవరం మండలం పోతులనాగేపల్లి మీదుగా ఇసుక లోడుతో ట్రాక్టర్లు దూసుకెళ్తున్నాయి. వీధుల్లో చిన్నారులు, పశువులను సైతం చూసుకోకుండా వేగంగా వాహనాలు నడుపుతూ బెంబేలెత్తిస్తున్నారు. ఇసుక తరలింపు అడ్డుకోవాలని గ్రామస్తులు అర్జీలు సమర్పించినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

తాగునీటికి తీవ్ర ఇబ్బందులు..

పోతులనాగేపల్లి, తుంపర్తి, కనంపల్లి, సీసీ కొత్తకోట గ్రామాలు చిత్రావతి నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయి పై గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా చిత్రావతి నదికి అటు ఇటుగా ఉన్న వ్యవసాయ బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది, ఈ ఏడాది బలమైన వర్షాలు కురవకపోవడంతో నది ప్రవహించలేదని, ఇలాంటి సమయంలో ఇసుక తరలించుకుపోతే భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందంటున్నారు. అక్రమ తవ్వకాల గురించి అధికారులు, పోలీసులకు సమాచారం ఇస్తున్నా స్పందన లేదని ప్రజలు చెబుతున్నారు. ఇసుకాసురుల నుంచి ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు.

బోరు చుట్టూ తవ్వకాలు..

పోతులనాగేపల్లికి తాగునీటిని అందించేందుకు చిత్రావతిలో వేసిన బోరు చుట్టూ ప్రస్తుతం ఇసుక తవ్వుతున్నారు. దీంతో పైపులు బయట పడి బోరు నుంచి నీరు రావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు ఇసుక తవ్వకాలను అడ్డుకుంటే ఇటు తాగునీటికి, అటు సాగునీటికి ఇబ్బందులు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

రెండేళ్లలో రైల్వేలైన్ పనుల పూర్తి

- కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమన్న
- రాయదుర్గం– తుమకూరు రైల్వేలైన్ పనుల పరిశీలన



మంత్రి సోమన్నకు వినతిపత్రం ఇస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

మడకశిర: రాయదుర్గం – తుమకూరు రైల్వే లైన్ పనులను రెండేళ్లలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమన్న తెలిపారు. ఆయన శనివారం మడకశిర సమీపంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రైల్వేశాఖ అధికారులతో కలిసి రైల్వేలైన్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మట్లాడుతూ యూపీఏ ప్రభుత్వ హయాంలోనే రైల్వేలైన్ మంజూరైందని, అయితే సరైన పర్యవేక్షణ లేక పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం రాయదుర్గం – తుమకూరు రైల్వే లైన్ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రైల్వే లైన్ పూర్తయిన వెంటనే రాయదుర్గం నుంచి చిత్రదుర్గ, చెళ్లకెరకు కూడా రైళ్లు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధితులను ఆదుకుంటాం..

రాయదుర్గం – తుమకూరు రైల్వేలైన్ నిర్మాణం వల్ల మడకశిర పట్టణంలో దాదాపు 40 మంది ఇళ్లు కోల్పోనున్నారు. వీరిని ఆదుకోవాలని స్థానిక నాయకులు మంత్రి సోమన్నకు వినతిపత్రం అందించారు. మంత్రి స్పందిస్తూ బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నిర్వాసితులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని తహసీల్దార్ వెంకటేశ్‌ను ఆదేశించారు.

ఓబీసీలో చేర్చేందుకు కృషి..

మడకశిర నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలు, సాదర, వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చడానికి తనవంతు కృషి చేస్తానని రైల్వే మంత్రి సోమన్న హామీ ఇచ్చారు. ఆయన శనివారం మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇంటి ఆవరణలో నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. తమను ఎస్టీ జాబితాలోకి చేర్పించాలని వాల్మీకి సంఘం నాయకులు, తమను ఓబీసీ జాబితాలో చేర్పించాలని కుంచిటి వక్కలిగ, సాదర, వీరశైవ లింగాయత్ సంఘాల నాయకులు మంత్రికి వినతిపత్రాలు అందించారు. సాదర, వీరశైవ లింగాయత్‌లను కూడా ఓబీసీలో చేర్పించడానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఏపీలోని వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించడానికి కృషి చేస్తానని చెప్పారు. సరిహద్దు ప్రాంత ప్రజలు అన్నదమ్ముల్లా ఉండామని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రిగా తనకు అన్ని ప్రాంతాలూ సమానమేనని స్పష్టం చేశారు. సమావేశంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కర్ణాటక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జగన్నాథ రథోత్సవం.. మురిసిన భక్తజనం





భక్తజనం నడుమ సాగుతున్న జగన్నాథ రథయాత్ర

అనంతపురం కల్చరల్: నగరంలో శనివారం పూరీ జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. భక్తులను మంత్రముగ్ధులను చేసింది. హరేరామ.. హరే కృష్ణ నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. చెక్కభజన, వీధినాటకం, కోలాటం, కీలు గుర్రాలు, ఒళ్లు గగుర్పొడిచే ఖడ్గ విన్యాసాలు, షేర్ డ్రమ్స్ కళాకారుల విన్యాసాలు, శివశబ్దాలు, ఉరుముల కళాకారులు సందడి చేశారు. శాస్త్రీయ నృత్యాలు, పురాణ ఇతిహాసాల కళారూపాలను ప్రదర్శిస్తూ జగన్నాథ, సుభద్ర, బలదేవులకు సాదర స్వాగతం పలికారు. వేద మంత్రాలు, మేళ తాళాలు, భాజా భజంత్రీల వాయిద్యాల నడుమ జగన్నాథ రథయాత్ర పుర వీధుల్లో సాగుతున్నప్పుడు వివిధ దేవతామూర్తుల వేషధారుల కళారూపాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముందుగా స్థానిక కేఎస్ఆర్ కళాశాల వద్ద నదీజలాలతో సంప్రోక్షణ అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు బంగారు చీపురుతో రథం ముందు శుభ్రం చేశారు. అనంతరం ఆధ్యాత్మికవేత్తలు సత్యగోపీనాథ్, ప్రముఖ ప్రవచన కర్త రాధామనోహరదాసు జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ నుంచి లలిత కళాపరిషత్ వరకూ సాగిన రథయాత్రలో భక్తులు అడుగడుగునా హారతులతో భక్తి నీరాజనాలర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్‌తో పాటు సత్యగోపీనాథ్, రాధామనోహరదాసు ప్రభు మాట్లాడుతూ ఇస్కాన్ సేవలు ఎనలేనివని కొనియాడారు. పూరీ పుణ్యక్షేత్రంలో సాగే మహావేడుకలను తిలకించలేని వారి ముంగిటకే వేడుకలను ఇస్కాన్ తెచ్చిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక లలిత కళాపరిషత్తులో ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇస్కాన్ బెంగళూరు అధ్యక్షులు వరదరాజ ప్రభు, టీటీడీ ధార్మిక మండలి అధ్యక్షులు శ్రీపాద వేణు, మాజీ మంత్రి శైలజానాథ్, సుదర్శనప్రభు తదితరులు పాల్గొన్నారు.



రథయాత్ర ముందు మహిళల నృత్యం

పురోభివృద్ధిలో మహిళా డిగ్రీ కళాశాల

- న్యాక్ పీర్ కమిటీ సభ్యుల ప్రశంస



న్యాక్ బృందానికి నివేదికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: హిందూపురం ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా చేపట్టిన న్యాక్ బృందం పరిశీలన శుక్రవారం రాత్రి ముగిసింది. మహిళల విద్యావికాసం కోసం ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో అతి కొద్ది స్థలంలో విద్యార్థినులు, అధ్యాపకులు అద్భుతమైన విజయాలు సాధిస్తూ, అభివృద్ధి సాధిస్తున్నారని బృందం సభ్యులు కొనియాడారు. కళాశాల మరింత పురోగతి కోసం కార్పొరేట్ సంస్థలు, దాతలు, పూర్వ విద్యార్థినులు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య ఆర్ముగం ఆధ్వర్యంలో ఉత్తర ప్రదేశ్‌లోని పూర్వాంచల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ మానస్ పాండే, కేరళ శ్రీ శంకర విద్యాపీఠం ప్రిన్సిపాల్ పి.పద్మ సభ్యులుగా ఉన్న న్యాక్ పీర్ కమిటీ మహిళా డిగ్రీ కళాశాలలో ఐదేళ్ల అభివృద్ధికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసింది. చివరగా జరిగిన ఎగ్జిట్ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు ఆర్ముగంకు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి కళాశాల నివేదికను అందజేశారు. మెంబర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మానస్ పాండే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఆడపిల్లల కోసం నెలకొల్పిన ఈ కళాశాలలో విద్యతో పాటు, క్రీడల్లోను, సాంస్కృతిక కార్యకలాపాల్లోను అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కళాశాలకు అదనపు స్థలంతో పాటు, ఆట స్థలం సమకూర్చినట్లయితే గ్రామీణ యువతులు మరింతగా రాణించి, అద్భుతాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. తరగతుల నిర్వహణకు, క్రీడలకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయ కర్త శ్రీలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అకడమిక్ సమన్వయకర్త శ్రీధర్, యశోద, భోజప్ప, ఎల్.ఆర్. రమేష్, పార్వతి, రవినాయక్, సుమంగళి, సరస్వతి, ప్రకాశరావు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీ న్యాయవాదుల సంఘం నూతన కమిటీ ఎంపిక


మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్


ధర్మవరం అర్బన్: స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం నిర్వహించిన సమావేశంలో శ్రీ సత్యసాయిజిల్లా బీసీ న్యాయవాదుల సంఘం అడ్‌హాక్ కమిటీని ఎంపిక చేసినట్లు రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాదులు జీసీ నల్లప్ప, ఏ కృష్ణమోహన్, అధ్యక్షుడిగా మేకల రామంజినేయులు, ప్రధాన కార్యదర్శిగా కె.అశోక్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. త్వరలో పూర్తి కమిటీని ఎన్నుకుంటామని రాష్ట్ర కన్వీనర్ తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు బన్నిలా మహేష్, కిశోర్‌కుమార్, బిల్లే రవి, బిల్లే నరేంద్ర, సాకే రామంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై దాడి


ఇంట్లో వస్తువులను ధ్వంసం చేసిన దృశ్యం

బత్తలపల్లి: మేకలు పొలంలో మేశాయంటూ భార్యాభర్తలపై దాడి చేసిన ఘటన సంగాల గ్రామంలో శనివారం జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం..గ్రామానికి చెందిన రామకృష్ణ, వెంకటలక్ష్మి భార్యాభర్తలు. శుక్రవారం వీరి మేకలు నాగరాజు, మాధవరాజు పొలంలోకి పోయి మేశాయంటూ రెండు మేకల కాళ్లు విరగ్గొట్టారు. దీనిపై భార్యాభర్తలు నాగరాజు, మాధవరాజును ప్రశ్నించడంతో దాడి చేశారు. ధర్మవరం నుంచి తన నలుగురు అనుచరులతో వచ్చిన బాలరాజు కూడా వారిపై దాడి చేశాడు. తిరిగి సాయంత్రం ఇంటి మీదకు దాడి చేసి ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, టీవీ, బీరువాను పగలకొట్టి రెండు జతల బంగారు కమ్మలు, రూ.23వేలు నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దీర్ఘకాల నొప్పిమాయం



ఈ ఫొటోలో కన్పిస్తున్న వీరి పేర్లు కృష్ణరావు, ధనలక్ష్మి, లక్ష్మిదేవి, సత్యనారాయణ వీరిది భద్రాచలం. దీర్ఘకాలిక నొప్పులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని భద్రచలం నుంచి అనంతపురం జీజీహెచ్‌లో పాలియేటివ్ చికిత్స తీసుకున్నారు. ఇక్కడ అందించిన సేవల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. భద్రాచలం మాత్రమే కాకుండా నెల్లూరు, కడప, శ్రీకాకుళం, చిత్తూరు, పులివెందుల, తదితర ప్రాంతాల నుంచి రోగులకు జీజీహెచ్‌లో సేవలు పొందుతున్నారు.



- పాలియేటివ్ చికిత్సకు విశేష స్పందన
- పక్క రాష్ట్రాల నుంచి జిల్లాకు వస్తున్న రోగులు
- ప్రభుత్వాస్పత్రిలో ఏడాదిలో 4 వేల మందికి చికిత్స
- అనస్తీషియా వైద్యుల ఘనత

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా విభాగంలో జరుగుతున్న పాలియేటివ్ చికిత్సలకు విశేష స్పందన వస్తోంది. దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే రోగులకు ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో చికిత్సనందిస్తున్నారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 4వేల మందికిపైగా రోగులకు అనస్తీషియా వైద్యులు సేవలందించారు. ప్రైవేట్‌గా ఇటువంటి వైద్యం చేయించుకోవాలంటే రూ.వేల నుంచి రూ.లక్షలు ఖర్చు అవుతుంది.

గతేడాది ప్రారంభం

గతేడాది మే 5న అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ చేతుల మీదుగా పాలియేటివ్ క్లినిక్ ప్రారంభమైంది. శరీరంలోని వివిధ విభాగాల్లో దీర్ఘకాలిక నొప్పులతో ఇబ్బంది పడే వారికి ఇంజెక్షన్ ద్వారా చికిత్సనందిస్తున్నారు. మోకాళ్లు, సర్వైకల్, భుజం, కండరం, ఎముక, కేన్సర్, పాంక్రీయాస్, ఇన్‌ఫెక్షన్స్, తదితర నొప్పులకు ఇంజెక్షన్ ద్వారా చికిత్సనందిస్తున్నారు. మోకాళ్ల నొప్పులకు సంబంధించి ప్లాస్మా థెరపీకి ప్రైవేట్‌గా రూ.లక్షన్నర ఖర్చు అవుతుంది. అటువంటిది జీజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు.

పైసా ఖర్చు లేకుండా సేవలు

నొప్పి నివారణ కేంద్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. దీర్ఘకాలిక నొప్పులతో బాధపడేవారికి మెరుగైన వైద్యం అందించాం. తద్వారా రోగులు నిమిషాల వ్యవధిలో కోలుకుంటున్నారు. ఉచితంగా అందిస్తున్న సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నవీన్‌కుమార్(హెచ్‌ఓడీ, అనస్తీషియా విభాగం

అందుబాటులోకి హోల్ స్కాన్ మిషన్


పెయిన్ రిలీఫ్ క్లినిక్ పరికరాన్ని సిబ్బందికి చూపుతున్న డాక్టర్ నవీన్‌కుమార్

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలోని పెయిన్ రిలీఫ్ క్లినిక్‌లో రూ.15 లక్షలు విలువ చేసే హోల్ బాడీ స్కాన్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. శనివారం ఆ మిషన్ వినియోగానికి సంబంధించి వైద్యులు, టెక్నీషియన్లు తదితర సిబ్బందికి అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్ పలు సూచనలు, సలహాలనందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయిన్ రిలీఫ్ క్లినిక్‌లో దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే వారికి చికిత్సనందించి నొప్పులు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శరీరంలో ఏ ప్రాంతంలో నొప్పి ఉందో తెలుసుకుని కచ్చితమైన నరం ఉండే ప్రాంతంలో ఇంజెక్షన్ అందించేందుకు పరికరం ఉపయోగపడుతుందన్నారు. ఈ మిషన్ ద్వారా టూడీ ఎకో, అబ్డామిన్, నరాలు, తదితర వాటిని స్కాన్ చేసుకోవచ్చని వివరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- 15 తులాల బంగారం రికవరీ

బత్తలపల్లి: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు చోరీ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ పి.శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. ధర్మవరం కేతిరెడ్డి కాలనీకి చెందిన షేక్ ఖాజాపీరా చెడు అలవాట్లకు బానిసై డబ్బు కోసం చోరీలకు పాల్పడేవాడు. ఈక్రమంలో గతనెల గత నెల 21న ఉదయం బత్తలపల్లి వినాయక్‌నగర్‌లో బోర్‌వెల్ యజమాని వడ్డె రామాంజనేయులు భార్య మల్లెల జ్యోతి స్నానం చేసేందుకు ఇంటికి తాళం వేసి వరండాలోని స్నానపు గదిలోకి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన ఖాజాపీరా ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు ఏడున్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం బత్తలపల్లిలోని ధర్మవరం రోడ్డులో ఉన్న అన్నపూర్ణ డాబా వద్ద నిందితుడిని పట్టుకున్నారు. పైచోరీపాటు చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లిలో ఏడున్నర తులాల బంగారం నగలను చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ.9 లక్షల విలువచేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందిని అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు

మద్యం దుకాణం కేసులో నిందితులను పట్టుకుంటాం..

బత్తలపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ చేసిన కేసులో నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు తెలిపారు. ఈ ఏడాది మార్చి 10న బత్తలపల్లిలోని మద్యం దుకాణంలో రూ.10,95,390 నగదు, రూ.3,31,135లు విలువ చేసే మద్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా చోరీ సొత్తు రికవరీ చేసిన సీఐ, ఎస్‌ఐ సిబ్బందిని స్థానికులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు


చంద్రమోహన్‌రెడ్డి (ఫైల్)

నల్లచెరువు: యర్రగుంటపల్లి వద్ద శనివారం ఉదయం కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి(41) తన భార్య కరుణశ్రీతో కలిసి కుమార్తె భవ్యశ్రీని తమిళనాడులోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్‌లో చేర్పించడానికి సొంత కారులో బయలుదేరారు. యర్రగుంటపల్లి వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చింతచెట్టును వేగంగా ఢీ కొంది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు.


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

సీమ సమస్యలకు సాహిత్యంతో పరిష్కారం

అనంతపురం కల్చరల్: రాయలసీమ సమస్యలకు సాహిత్యం ద్వారా చక్కటి పరిష్కార మార్గం దొరుకుతుందని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి అభిప్రాయపడ్డారు శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని సింగమనేని సభాప్రాంగణంలో రాయలసీమ హక్కుల పత్రం-ప్రస్తుత పరిస్థితి, సాంస్కృతిక రాయలసీమ, చారిత్రక రాయలసీమ, చారిత్రక నవల-రాయలసీమ తదితర అంశాలపై చర్చాగోష్టులు జరిగాయి. 100 టీఎంసీ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బండి నారాయణస్వామితో పాటూ సీమ ఉద్యమకారుడు రమేష్, ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, ఇంటాక్ అధ్యక్షుడు రాంకుమార్, విశ్రాంత జడ్జి అన్వర్ తదితరులు మాట్లాడారు. నిర్వాహకులు మాట్లాడుతూ రెండు రోజుల రాజకీయ పార్టీలకతీతంగా సీమకు రావాల్సిన నిధులు, నీళ్ల గురించి ఆలోచనాత్మకంగా చర్చలు నిర్వహిస్తామన్నారు. కథ, నవల, కవిత ద్వారా రాయలసీమ సమస్యలను అందరి ముంగిటకు తీసుకుపోవచ్చన్న ఉద్దేశంతో సాహితీవేత్తలందరినీ భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బండి నారాయణస్వామి

జీఓ 596 రద్దు.. పేదల నోళ్లు కొట్టడమే

- వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీ రమణ

రాప్తాడురూరల్: ప్రభుత్వం జీఓ 596ను రద్దు చేయడమంటే పేదల నోళ్లు కొట్టడమేనని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీ రమణ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర, నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు ఏనాడూ పేదవానికి జానెడు భూమి పంచాలని, భూ సంస్కరణలు తీసుకురావాలనే ఆలోచనే రాలేదన్నారు. ఇందిరా గాంధీ తర్వాత రాష్ట్రంలో వైఎస్సార్, ఆ తర్వాత వైఎస్ జగన్ మాత్రమే వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిపెట్టారని గుర్తు చేశారు. పేదవాడు ప్రైవేటు భూములతో సమానంగా తమ అవసరాలకు ఆస్తిని అమ్ముకొనే స్థితిని కల్పించే సాహసానికి పూనుకొని జూలై 31 2023న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 596 జీఓ తెచ్చారన్నారు. తద్వారా 20 ఏళ్ల స్వాధీనానుభవంలో ఉన్న భూములు అన్నింటినీ ప్రైవేటు భూములతో సమానంగా అమ్ముకొనే వెసులుబాటు కలిగిందన్నారు. ఆరోజు వరకు రిజిస్టర్ కాకుండా అనామతులో ఉన్న భూములకు సైతం, రిజిస్టర్ చేసుకొనే వెసులుబాటు కల్పించారన్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతం జరిగి ఉంటే, మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకు రిజిస్టర్లు చేసి ఉంటే వాటిపై చర్యలు తీసుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. అయితే 596 జీఓను రద్దు చేయడం అంటే ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం, పేదవాని నోరు కొట్టడమేనని స్పష్టం చేశారు.

భక్తులతో పోటెత్తిన గూగూడు


ప్రత్యేక అలంకరణలో గూగూడు కుళ్లాయి స్వామి


గూగూడులో భక్తుల సందడి

నార్పల: మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని గూగూడు జనసంద్రంలా మారింది. కుళ్లాయిస్వామి దర్శనానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు రావడంతో స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. క్యూలలో గంటల తరబడి వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నేడు చిన్నసరిగెత్తు..

ఉత్సవాల్లో భాగంలో ఆదివారం కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు ఈ వేడుక జరగనుంది. ఈ సందర్భంగా స్వామి వారికి చదివింపులు ఇచ్చి మొక్కులు తీర్చుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. భక్తుల రద్దీని నియంత్రించడానికి అధికారులు, పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆలయ పరిసరాలు ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.


కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

జీపీఎస్‌పై గెజిట్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

ఎన్పీకుంట: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) స్థానంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన గ్యారెంటీ పెన్షన్ పథకం (జీపీఎస్)కు సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఎస్టీయూ ముఖ్య నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులంతా పాత పెన్షన్ విధానం కావాలని ఆకాంక్షిస్తుంటే పాత తేదీతో జీపీఎస్ అమలుకు గెజిట్ జారీ చేయడం అన్యాయమన్నారు. ఈ చర్య ఉద్యోగులందరినీ జీపీఎస్ పరిధిలోకి తెచ్చేలా ఉందని, దీన్నీ ఎస్టీయూ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గెజిట్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జవహర్, మండలాధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీరమహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన కూటమి ప్రభుత్వం

ఓడీచెరువు: సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫొద్దీన్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2023 అక్టోబర్ 20 నుంచి జీపీఎస్ అమల్లోకి వచ్చినట్లు గెజిట్ విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన జీఓ-54ని జూన్ 12నే జారీచేసి ఇప్పటి వరకు దాన్ని బయటపెట్టక పోవడంలో ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

మాన్యం భూమిలో భారీగా వెలసిన గుడిసెలు


ట్రస్ట్ భూమిలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక గుడారాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని దేవుని మాన్యం భూమిలో భారీగా గుడిసెలు వెలిశాయి. రెండు రోజుల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో నిడిమామిడి ట్రస్ట్‌కు సంబంధించి 401 సర్వే నంబర్‌లో 19.84 ఎకరాల భూమిలో ఎర్రజెండాలను పాతి భూ ఆక్రమణ చేసిన విషయం తెలిసిందే. దేవునిమాన్యంలో బత్తలపల్లి, బత్తలపల్లి మండలంలోని గ్రామాలతో పాటు జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 1000 మంది తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. పగలు, రాత్రి గుడిసెల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. సీపీఐ డివిజన్ నాయకులతో పాటు మండల స్థాయి నాయకులు అక్కడే ఉంటూ పర్యవేక్షిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బేకరీ మాస్టర్ మృతి


మృతుడు రఫిక్

గోరంట్ల: బేకరీలో మాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన రఫిక్(45) స్థానిక గురురాఘవేంద్ర బెంగళూరు బేకరీలో పని చేసేవాడు. సాదిక్ లాడ్జీ వెనుక భాగంలోని ఓ నాలుగు అంతస్తుల భవనంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భవనంపై భాగంలో నీటి ట్యాంక్ పక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చుట్టపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.